సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



రూ.2 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సుంకర లక్ష్మీసత్యనారాయణ, కుమారులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
40.0°/26.4°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.0	24.0
కాకినాడ	36.0	25.1
అమలాపురం	39.5	26.4

న్యూస్‌రీల్

సామాజిక హక్కుల సంస్కర్త అంబేడ్కర్

జిల్లా ఎస్పీ శ్రీధర్



ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: సామాజిక హక్కులు, కుల నిర్మూలన కోసం పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓ సంఘ సంస్కర్త అని జిల్లా ఎస్పీ సుస రాపు శ్రీధర్ అన్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగిన అంబేడ్కర్ 133వ జయంతి కార్యక్రమంలో ఎస్పీ శ్రీధర్ మాట్లాడారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఏఆర్ డీఎస్పీ పి.విజయ సారథి, స్పెషల్ బ్రాంచి సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్, సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావు, ఎస్పీ కార్యాలయ ఎస్సైలు, సిబ్బంది కూడా అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ కార్యాలయ పోలీసు అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటం ఎదుట గౌరవ వందనం చేశారు.

అయినవిల్లిలో కిక్కిరిసిన భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి వివిధ పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచాయతన, ప్రత్యేక అభిషేకాల్లో 38 మంది, ప్రత్యేక దర్శనంలో 327 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 21 మంది పాల్గొని పూజలు చేశారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,45,680 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఇది రాక్షసత్వం

- సీఎం జగన్‌పై హత్యాయత్నంపై సర్వత్రా ఆగ్రహం
- చంద్రబాబు దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ మండిపాటు
- కోనసీమలో పెల్లుబికిన నిరసనలు

జనసంక్షేమ ప్రదాత, ఆంధ్రప్రదేశ్ ప్రగతి రథ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాష్ట్రం నడిబొడ్డు విజయవాడలో జరిగిన హత్యాయత్నంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఈ దురాగతాన్ని వైఎస్సార్ సీపీ నేతలతో పాటు సామాన్యులు సైతం తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు, బహిరంగ సభలకు వస్తున్న అశేష జనాదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు ఇటువంటి దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి రాక్షస చర్యలకు తావు లేదని ఆదివారం పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే దాడి



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి ఆధ్వర్యంలో నిరసన

పి.గన్నవరం: రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. సీఎం జగన్‌పై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచారంలో బస్సుపై ఉన్న జగన్ మీద రాళ్ల దాడిని నిరసిస్తూ విప్పర్తి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మూడు రోడ్ల సెంటర్లో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విప్పర్తి మాట్లాడుతూ జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి, ప్రతిపక్షాలకు వెన్నులో వణుకు పుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, పితాని నర్సింహరావు, యన్నాబత్తుల ఆనంద్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో ఎదుర్కొనలేకే దాడి

షేక్ అలీఖాన్ బాబా



సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్ బాబా

మండపేట: సంక్షేమ పాలనతో రాష్ట్ర ప్రజలందరి నుంచి నీరాజనాలు అందుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఎదుర్కోవడం సులభతరం కాదనే కడుపుమంటతో టీడీపీ దుష్టశక్తులు దాడి జరిపాయని షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై దాడి జరపడం హేయమైన చర్య అని అభివర్ణించారు. స్థానిక విజయలక్ష్మినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల శంఖారావం పూరించడానికి ఏర్పాటు చేసిన సిద్ధం సభల ద్వారా సీఎం జగన్ ప్రజలతో మమేకం అవుతున్న తరుణంలో టీడీపీ దుష్టశక్తులు దాడికి ప్రేరేపించాయని ఆరోపించారు. ప్రజా క్షేత్రంలో ఆయనను ఎదుర్కోలేక హత్యాయత్నానికి పాల్పడినట్టు తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. అదష్టవశాత్తూ ప్రజలకు అభివందనం చేస్తూ ఆయన పక్కకు తిరగడంతో కణతకు బదులుగా ఎడమ కనుబొమ్మపై గాయమైందన్నారు. దాడికి పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక దాడులు



తాటిపాకలో మాట్లాడుతున్న గొల్లపల్లి

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన రాళ్ల దాడికి చంద్రబాబు, అతని కుమారుడు లోకేష్ కారణమని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆరోపించారు. ఆదివారం ఆయన తాటిపాకలో మాట్లాడుతూ సీఎం జగన్ బస్సుయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. రాయలసీమ నుంచి ఎంతో సజావుగా సాగిన బస్సుయాత్రకు విజయవాడలోనే ఎందుకు దాడి జరిగిందే కోణంలో దర్యాప్తు చేయాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబు అధికారపక్షం లోపాలను నిలదీయడం విస్మరించి వ్యక్తిగత విమర్శలు చేయడం, సీఎం జగన్‌ను తొలినాళ్ల నుంచి హతమార్చాలనే కుయుక్తులు పన్నుతున్నాడని విమర్శించారు. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన మరణానికి కారణమైన చంద్రబాబును ఎన్టీఆర్ కుటుంబం క్షమించినా, సీఎం జగన్ జోలికి వస్తే మాత్రం టీడీపీని తెలుగుప్రజలంతా కలసికట్టుగా భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి క్షేమాన్ని కోరుతూ రాష్ట్రంలోని ప్రజలంతా ప్రార్థనలు చేసి ఆశీర్వదించాలని కోరారు.

జగన్‌పై హత్యాయత్నం హేయం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు



కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అని బాధ్యులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమ పాలనతో ప్రజాక్షేత్రంలో అగ్రభాగాన నిలవడం, ప్రజలు సీఎం జగన్‌ను దేవుడిగా కొలుస్తుండటాన్ని చంద్రబాబు, దుష్ట చతుష్టయం సహించలేకపోతున్నారన్నారు. అసహనమూ, అభద్రతాభావంతోనే సీఎం జగన్‌పై చంద్రబాబు అనుచరగణం దాడికి పాల్పడ్డారన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టాలన్నారు. ఇటీవల కాలంలో సీఎం జగన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్న నేపథ్యం దాడికి కారణంగా కనపడుతోందన్నారు. ఒక వైపు దాడిని ఖండించిన చంద్రబాబు మరో వైపు అతని అనుచర గణం తప్పుడు ప్రచారానికి తెరలేపడం సరి కాదన్నారు. భౌతిక దాడులను యావత్ ప్రజానీకం వ్యతిరేకిస్తుందని, ప్రజలే సరైన సమయంలో ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెబుతారని పాపారాయుడు అన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నూపుర్ అజయ్, అధికారులు

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆయన రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచి మనకు దిక్సూచిగా ఉంటూ నేటికీ మనలను ముందుకు నడిపిస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలో అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆ మహనీయుని కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా, భారత దేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని, విశ్వ వ్యాపితం చేసిన మహోన్నత కీర్తి శిఖరం అంబేడ్కర్ అన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళా సాధికారత, మహిళల అభ్యున్నతికి, కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం రచించడం ద్వారా భారతదేశానికి దశ, దిశ చూపించారన్నారు. ఆయన రచించిన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని అంబేడ్కర్ జయంతిని దేశమంతటా పండగ వాతావరణంలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం, అగ్రకుల దురహంకారంపై గొంతెత్తిన స్వరం భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అన్నారు. భారతదేశ ప్రజల్లో సమానత్వం కోసం అహర్నిశలు తపించిన కృషీవలుడన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వాన్ని ఆస్వాదించే సమాజం గురించి అంబేడ్కర్ ఆలోచించిన దృక్పథాన్ని రాజ్యాంగ రచనలో పొందుపరిచారన్నారు. భారత రాజ్యాంగ రూపకర్త బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన మహనీయుడన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ సెక్షన్ సూపరింటెండెంట్ పి.సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మీ అందరివాడిని.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్
- ఆయనకు మద్దతుగా కమ్మ సంఘం సమావేశం



కమ్మ సామాజిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: 'మీలో ఒకడిగా ఉన్నాను, స్థానికుడిగా ఉంటున్నాను. అందరికీ అందుబాటులో ఉంటాను, అందరి వాడిగా ఒకటై ఉంటాను నన్ను ఆశీర్వదించండి' అని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నియోజకవర్గ స్థాయి కమ్మ సామాజిక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, ఆయన తండ్రి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కమ్మ సంఘం నియోజకవర్గ నాయకుడు రావిపాటి రవీంద్రనాథ్ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచారని, ప్రస్తుత ఎనికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఏ సమస్య వచ్చిన మీ ముందుంటానని, తనకు మద్దతు పలకాలని కోరారు. అనంతరం ఎంపీ బోస్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా నియోజకవర్గంలో తనకు కమ్మ సంఘం నేతలు అండగా నిలిచారని, తన కుమారుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, తన కుమారుణ్ణి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గన్నమని చక్రవర్తి, రావిపాటి రవీంద్రనాథ్‌చౌదరి, వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, ఒబిలినేని రాజ్ కుమార్, గుణ్ణం వెంకటేశ్వరరావు, ప్రగతి వెంకన్న కూళ్ల చిన్ని, చిరట్ల కాశీవిశ్వనాథం తదితరులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా నియోజకవర్గ అభివృద్ధిలో ఎంతో ప్రముఖ పాత్ర వహించిన సుభాష్‌చంద్రబోస్ తమకు అండగా ఉన్నారని ఆయన కుమారుడికి ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీ బోస్ నియోజకవర్గ కమ్మ సంఘంతో ఎంతో అనుబంధంగా ఉంటారని, ఎటువంటి కష్టం వచ్చినా ముందుంటూ సమస్యలను పరిష్కరిస్తున్న ఆయన తనయుడు సూర్యప్రకాశ్‌ను ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. వైట్ల రాజబాబు, చిగురుపాటి సతీష్, బిక్కిన సురేష్, కంటిపూడి కృష్ణ, వైట్ల అచ్యుత రామప్రసాద్, వంటిపల్లి సత్యనారాయణ, ములకల వీరఘవులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే కాపుల సంక్షేమం

- ఆ వర్గానికి మరింత పెద్ద పీట
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విశ్వరూప్, వర ప్రసాదరావు
- అమలాపురంలో పార్టీ కాపుల సమ్మేళనం



మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే వరప్రసాదరావులను సత్కరిస్తున్న పార్టీ కాపు నాయకులు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలోనే కాపులకు అత్యంత సంక్షేమ లబ్ధి చేకూరిందని అమలాపురంలోని యెండూరి కన్వెన్షన్ హాలులో ఆదివారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ స్థాయి కాపుల సమ్మేళనంలో పార్టీ కాపు నాయకులు ఒకే మాటగా స్పష్టం చేశారు. ఇదే సమయంలో కాపులకు తగిన గుర్తింపు, తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అభ్యర్థించారు. సభకు ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పినిపే విశ్వరూప్, రాజోలు ఎమ్మెల్యే, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ కాపులకు పదవులపరంగా ఈసారి మరింత పెద్ద పీట వేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 31 మంది పార్టీ కాపు నాయకులకు పార్టీ టిక్కెట్లు ఇచ్చారని చెప్పారు. గత ఎన్నికల్లో తన విజయానికి కాపుల కృషి మరిచిపోలేనని చెప్పారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ కాపులు వైఎస్సార్ సీపీకి నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో కాపు నాయకులు 2019 ఎన్నికల్లో కంటే మరింత కలిసికట్టుగా పనిచేసి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల విజయానికి శ్రమిస్తామని స్పష్టం చేశారు. పార్టీ పట్ల పూర్తి విశ్వాసం, నమ్మకంతో పని చేస్తున్న కాపులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పార్టీ కాపు నేతలు తమ తమ ప్రసంగాల్లో విశ్వరూప్, వరప్రసాదరావులను అభ్యర్థించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సీఎం అవుతాడన్న ఆశతో కాపులు ఓట్లు వేశారని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సీఎం అయ్యే అవకాశం లేదని నిర్ధారణకు వచ్చిన కాపుల్లో చాలామందిలో నైరాశ్యం కనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు మంత్రి విశ్వరూప్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చివరిగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే వరప్రసాదరావులను కాపుల తరపున ఘనంగా సత్కరించారు. సభలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో పార్టీ పదవులు నిర్వహిస్తున్న కాపు నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, దంగేటి రాంబాబు, బద్రి బాబ్జీ, తిక్కిరెడ్డి వెంకటేష్, జిన్నూరి బాబీ, దూడల విరీతా దేవి, జిన్నూరి వెంకటేశ్వరరావు, మోటూరి సాయి, వంగా గిరిజాకుమారి ప్రసంగించారు.

అభ్యసన సామర్థ్యాలకు శ్లాస్

- 4వ తరగతి విద్యార్థులకు రేపు పరీక్షలు
- 157 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహణ
- హాజరుకానున్న 3,168 మంది విద్యార్థులు



రాయవరం: విద్యార్థి తరగతి పూర్తయ్యే సరికి ఆ తరగతికి సంబంధించిన విద్యా సామర్థ్యాలు, పాఠశాల విద్య పూర్తయ్యే సరికి సాధించాల్సిన లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంటుంది. పై తరగతిలోకి వెళ్లే ముందు కింది తరగతిలో సాధించాల్సిన అభ్యసన ప్రక్రియలు సాధిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ ఏటా ర్యాండమ్‌గా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తోంది. ముఖ్యంగా ప్రాథమిక దశలో చతుర్విధ ప్రక్రియల్లో విద్యార్థి పూర్తి స్థాయిలో పట్టు సాధించారా? లేదా? అనే విషయాన్ని పరీక్షిస్తున్నారు. ఇందుకు గాను ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకునేందుకు పలు పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో గతేడాది నవంబరు 3న సీస్ పరీక్షలు నిర్వహించారు. విద్యా సంవత్సరం ముగింపు దశలో 4వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకునేందుకు స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్) నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహిస్తున్న శ్లాస్ పరీక్షను జిల్లాలో ఎంపిక చేసిన 157 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలకు చెందిన 3,168 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

చతుర్విధ ప్రక్రియలపై పట్టు..

ప్రతి విద్యార్థి ఆయా తరగతిలో సాధించాల్సిన విద్యా ప్రమాణాలు ఎంత వరకు సాధిస్తున్నారో తెలుసుకునేందుకు విద్యాశాఖ ప్రయత్నిస్తోంది. ఉన్నత పాఠశాల విద్యార్థి తెలుగు పుస్తకం ధారాళంగా చదవలేకపోవడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు సాధించలేకపోతున్నారనే విమర్శలున్నాయి. అందుకే ప్రాథమిక దశ నుంచే తెలుగు చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పట్టు సాధించేలా చేసేందుకు విద్యాశాఖ పలు వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ప్రాథమిక స్థాయి పూర్తయ్యే సరికి విద్యార్థికి తెలుగు చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు పూర్తి అవగాహనతో చేయాల్సి ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్)ను జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నాలుగో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తారు. తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో సీఆర్పీలు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. 22 మండలాల్లోని 72 ప్రాథమిక, 21 ప్రాథమికోన్నత, 64 ఉన్నత పాఠశాలల్లో 4వ తరగతి విద్యార్థులకు శ్లాస్ పరీక్ష నిర్వహిస్తారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇంగ్లిషు, గణితం పరీక్షను 1,101 మంది, ఇంగ్లిషు, తెలుగు పరీక్షను 1,031, గణితం, తెలుగు పరీక్షను 1,036 మంది రాయనున్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలో వారి సామర్థ్యాలను గుర్తించడానికి ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ పరీక్షల ఫలితాలను రాష్ట్ర పరిశోధనా మండలికి పంపిస్తారు. ఈ పరీక్ష ఫలితాల ద్వారా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు కొరవడడానికి గల కారణాలను అన్వేషిస్తారు. తదనంతరం ప్రాథమిక విద్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై శోధన చేస్తారు.

పరీక్ష పత్రాల సరఫరా



ఎంపిక చేసిన పాఠశాలలకు పరీక్షా పత్రాలను సరఫరా చేశాం. పరీక్ష ఎలా నిర్వహించాలనే అంశంపై ఎంఈవోలు, సీఆర్పీలకు అవగాహన కల్పిస్తున్నాం. పరీక్షల ఫలితాలను ఎస్‌సీఈఆర్‌టీకి పంపిస్తాం.

– బి.హనుమంతరావు, డీసీఈబీ సెక్రటరీ, అమలాపురం.

పకడ్బందీగా నిర్వహిస్తాం



గతేడాది నవంబరులో నిర్వహించిన 'సీస్' పరీక్షల మాదిరి గానే 'శ్లాస్' పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహిస్తాం. విద్యార్థుల్లోని కచ్చితమైన సామర్థ్యాలు తెలుసుకునే ప్రయత్నమే శ్లాస్. సీఆర్పీలు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో ఈ పరీక్షల నిర్వహణకు సహకరించాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

నియోజకవర్గంలోని మండలాలు	పాఠశాలలు ప్రభుత్వ	ప్రైవేట్	ప్రైమరీ	యూపీ	ఉన్నత
అయినవిల్లి	03	--	02	01	--
ఆలమూరు	05	01	04	01	01
అల్లవరం	08	--	05	02	01
అమలాపురం	09	04	07	03	03
అంబాజీపేట	03	--	01	--	02
ఆత్రేయపురం	03	02	03	--	02
ఐ.పోలవరం	10	--	04	--	06
కె.గంగవరం	04	--	03	--	01
కపిలేశ్వరపురం	05	01	04	01	01
కాట్రేనికోన	08	--	03	02	03
కొత్తపేట	06	--	03	--	03
మలికిపురం	09	01	06	04	--
మామిడికుదురు	05	03	04	01	03
మండపేట	09	02	03	01	07
ముమ్మిడివరం	02	02	02	02	--
పి.గన్నవరం	08	--	05	--	03
రామచంద్రపురం	12	01	03	02	08
రావులపాలెం	08	03	07	--	04
రాయవరం	05	--	02	--	03
రాజోలు	04	03	01	--	06
సఖినేటిపల్లి	05	--	--	01	04
ఉప్పలగుప్తం	03	--	--	--	03

క్లుప్తంగా

ముఖ్యమంత్రిపై దాడిపై ఆందోళన

భద్రతా బలగాలను పెంచాలని గవర్నర్‌కు వినతి

మండపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో ఎన్నికల ప్రచార సభలో రాళ్లతో దాడి జరగడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరిగేటప్పుడు భౌతిక దాడులు చేయడం నీచమైన సంస్కృతి అని ఆయన అన్నారు. వెంటనే జగన్‌కు భద్రత పెంచాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాదాలతో అప్రమత్తం

- జిల్లా అగ్నిమాపక అధికారి పార్థసారథి
- అగ్ని మాపక వారోత్సవాల ప్రారంభం



అగ్ని మాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి పార్థసారథి, అమలాపురం అధికారి కొండబాబు, సిబ్బంది

అమలాపురం టౌన్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను చాలా వరకూ అదుపు చేయవచ్చని జిల్లా అగ్నిమాపక, విపత్తుల స్పందన అధికారి ఎస్.పార్థసారథి జిల్లా ప్రజలకు సూచించారు. అమలాపురంలోని అగ్ని మాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను పార్థసారథి ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అగ్ని ప్రమాదాల నివారణకు సూచనలు, జాగ్రత్తలతో ముద్రించిన కర పత్రాలను ఆవిష్కరించారు. అమలాపురం అగ్ని మాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్థసారథి మాట్లాడుతూ ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు అగ్నిమాపక కేంద్రాల ద్వారా ఈ వారం రోజులూ జిల్లాలో పలు కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద ప్రజలకు అవగాహన కల్పించి పలు పరికరాలతో ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాదాలను అదుపు చేసే విధానాలను వివరిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్మృతి పరేడ్ ద్వారా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తొలుత అగ్నిమాపక పతాకాన్ని ఆవిష్కరించారు. అమలాపురం కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకీ ఓ లెక్కుంది



- మూడు దశలు దాటాకే వడదెబ్బ
- ఈ విషయంపై ప్రజల్లో అవగాహన అవసరం
- ఆ దశకు చేరకుండా అప్రమత్తమవ్వాలి
- తారాస్థాయిలో ఎండలపై వైద్యుల సూచనలు



ప్రజలకు ఉచితంగా ఓఆర్‌ఎల్ ప్యాకెట్లు పంచుతున్న వైద్య సిబ్బంది

కాకినాడ క్రైం: ఎండలు తారాస్థాయిస్తున్నాయి. సాధారణంగా మే నెలలో కనిపించే తీవ్రత ఏప్రిల్ నెల తొలి వారం నుంచే మొదలైంది. ఉదయం 10వ గంట కొట్టినప్పటి నుంచే మండుటెండ విరుచుకుపడుతోంది. ఏసీలు, ఫ్యాన్ల కింద ఉద్యోగ వ్యవహారాలు చేసుకునే వారి స్థితి కొంత ఫర్వాలేదనిపించినా.. పొట్ట చేతపట్టి రోడ్లపై తిరిగి ఉద్యోగమో, వ్యాపారమో చేసుకునే వారి పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంటోంది. ఇటువంటి వారు ఎండ దెబ్బకి గురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని అప్రమత్తం చేస్తూనే, అదే జరిగితే తక్షణమే తగిన సహాయం అందకపోతే ప్రాణాపాయమేనని హెచ్చరిస్తున్నారు. అయితే, వారి రోజువారి కార్యాకలాపాలపై అవగాహనతో ప్రతి వారు ఎండ ప్రభావానికి లోను కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా అవగాహన కలిగి ఉండాలంటున్నారు. వడదెబ్బ స్థితి అమాంతం సంభవించదని వివరిస్తూ వాటిలో దశలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆ వివరాలు మీ కోసం...

వడదెబ్బ అంటే...

తీవ్రమైన ఎండ, లేదా వడగాల్పుల ప్రభావం వల్ల ముక్కు, చెవి ఇతర శరీర మార్గాల ద్వారా వేడి శరీరంలో పలికి చేరి శరీర ఉష్ణోగ్రతను నెమ్మది నెమ్మదిగా పెంచేస్తుంది. ఈ స్థితిలో వేడి పెరగడం వల్ల కనీసం 103 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువకు చేసి అవయవాల పనితీరుపై ప్రభావం చూపి విధ్వంసానికి సిద్ధమవుతుంది. ఈ స్థితిలో మనిషి కుప్పకూలి మరణం అంచుల వరకు వెళతాడు. తగిన సహాయం తక్షణమే అందకపోతే ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. అయితే ఇది అమాంతం సంభవించేది కాదు. ఈ స్థితికి చేరడానికి కొన్ని దశలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

మూడు దశల్లో...

వడదెబ్బకు గురయ్యే వ్యక్తి తొలుత మూడు దశలకు లోనవుతాడు. ఈ దశలు కొనసాగుతుండగా ఏ మాత్రం అప్రమత్తమైనా ఆ వ్యక్తిని ఆ ప్రమాదం తప్పించవచ్చు. ఈ దశలకు వ్యక్తి ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా హీట్ రాషెస్, హీట్ క్రాంప్స్, హీట్ ఎగ్జాషన్‌గా నామకరణం చేశారు. హీట్ ఎగ్జాషన్ వడదెబ్బకు చివరి స్థితి. చిట్ట చివరిది అయిన ఈ స్థితిలో కూడా వడదెబ్బకి గురికాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

ఎవరికి ప్రమాదం అంటే..

హీట్ ఎగ్జాషన్ దశ దాటితే వడదెబ్బ అనివార్యం అవుతుంది.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఎండల్లో తిరిగేవారు, మార్కెటింగ్, కూలి పనులు చేసే వారికి ఈ ప్రమాదం ఎక్కువ. వృద్ధులు, చిన్నపిల్లలు సైతం వడదెబ్బ ప్రమాదానికి లోనయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా కిడ్నీ బాధితులు తగిన జాగ్రత్తలతో వ్యవహరించాలి.

ఏం జరుగుతుందంటే...

శరీర ధర్మశాస్త్రం ప్రకారం తనకేం కావాలో తనే అడగటం. అలసట అనిపిస్తే విశ్రాంతి, దాహం అనిపిస్తే నీరు, ఆకలి అనిపిస్తే ఆహారం, నొప్పి అనిపిస్తే ఉపశమనం కావాలనుకోవడం ఈ కోవలోకి వస్తాయి. సరిగ్గా ఈ శాస్త్రీయత పరిధిలోవే వడదెబ్బకు ముందరి దశలు. ఎండ దెబ్బకు గురవుతున్న వ్యక్తి తొలి దశలో దద్దుర్లు అనుభవిస్తాడు. ఇవి మెడ, తొడ, చంకలు, గజ్జలు, వీపు, ఛాతి ప్రదేశాలలో వస్తాయి. ఈ స్థితిని హీట్ రాషెస్ స్థితిగా పేర్కొంటారు. ఈ స్థితిని నిర్లక్ష్యం చేస్తే కండరాల నొప్పులు ప్రారంభం అవుతాయి. ఇవి సాధారణమైనవే అని చాలా మంది పారాసిటమాల్‌తో సరిపెడతారు. కానీ ఇవి ఎండ తీవ్రతకు లోనై, శరీరంలో నీటి నిల్వలు తగ్గిపోవడం వల్ల ఎదురయ్యే వడదెబ్బకు ముందర స్థితి. ఈ దశను హీట్ క్రాంప్స్ దశగా చెప్తారు. ఈ దశనూ నిర్లక్ష్యం చేస్తే, తీవ్రత పెరుగుతుంది. శరీరం విపరీతమైన అలసటకి గురికావడం, తల తిరగడం, కాళ్ల పిక్కల్లో విపరీతమైన నొప్పి, నోరు ఎండిపోవడం ఈ దశలో ఎదురయ్యే సమస్యలు ఈ దశను వైద్య పరిభాషలో హీట్ ఎగ్జాషన్‌గా పేర్కొంటారు.

కట్టుదిట్టంగా నివారణ చర్యలు



అత్యవసరం అయితే తప్ప ఎండలోకి రావద్దు. దశల వారీగా ఎండ దాడిని నిలువరిస్తూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ విస్తారంగా చేపడుతున్నాం. స్థానిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చలివేంద్రాలు లేదా మంచి నీటి ఏర్పాట్లకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం. ఆర్టీసీ ఉద్యోగులు, రోజు వారీ కూలీలు, సబ్ జైలు ఖైదీలు, అలాగే ఎండల్లో తిరిగే అవకాశం ఉన్న వివిధ వర్గాల ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రభుత్వం తరఫున ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఏఎన్ఎం, ఆశా కార్యకర్త వద్ద అత్యవసర పరిస్థితి కోసం ఈ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. వడదెబ్బ దశకు చేరకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా పాటను రూపొందించి అవగాహన కల్పిస్తున్నాం. సినిమా థియేటర్లలో ప్రత్యేక స్లైడ్‌లు వేస్తున్నాం. డూస్ అండ్ డోంట్స్ ప్రస్తావిస్తూ వడదెబ్బ నివారణ చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతోంది. – డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

ఇతర ఆరోగ్య సమస్యలపైనా..



ఎండ తీవ్రత వల్ల వడదెబ్బతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టే ఆస్కారం ఉంది. చర్మ వ్యాధులు, విరేచనాలు, హైగ్రేడ్ ఫీవర్లు ఈ సీజన్‌లో వచ్చే అనారోగ్యాల్లో కొన్ని.

ఎండాకాలంలో సాధారణం కంటే నీరు ఎక్కువగా తీసుకోవాలి. నీరు తక్కువగా తీసుకోవడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లు సంభవిస్తాయి. అధిక ఎండల వల్ల దాహం తాళలేక ఎక్కడపడితే అక్కడ నీరు తాగడం శ్రేయస్కరం కాదు. నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్ వంటి తీవ్ర అనారోగ్యాలు వాటిల్లుతాయి. ఎండాకాలంలో ఆరు బయట విక్రయించే కోసిన పండ్ల ముక్కల వల్ల ఆహార కాలుష్యానికి అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం.శ్రీ శైలజరాణి, ఎంఎస్, జీజీహెచ్, కాకినాడ

ఘనంగా సత్యదేవుని రథోత్సవ సేవ



ఆలయ ప్రాకారంలో సాగుతున్న సత్యదేవుని రథోత్సవం

- రూ.2,500 చొప్పున టిక్కెట్లతో సేవలో పాల్గొన్న ఇద్దరు భక్తులు

అన్నవరం: రత్నగిరీశుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారి రథోత్సవ సేవ ఆదివారం ఉదయం రత్నగిరి ఆలయ ప్రాకారంలో ఘనంగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజ గోపురం ముందుకు తీసుకువచ్చి ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించి అర్చకులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. తరువాత వేదపండితుల మంత్రాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో మూడు సార్లు రథంతో ప్రదక్షిణ చేయించారు. అనంతరం మళ్లీ పండితులు పూజలు చేసి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. వేదపండితులు యనమండ్ర శర్మ, రమేష్, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యశర్మ, పరిచారకులు ముత్య వేంకటరావు పూజలు చేశారు. ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, ఇతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సేవలో ఇద్దరు భక్తులు రూ.2,500 చొప్పున టిక్కెట్టు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులతో సేవలో పాల్గొన్నారు. వీరికి స్వామివారి అంతరాలయ దర్శనంతో బాటు వేదాశీస్సులు అందచేశారు. స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం అందజేశారు.

గూడాలలో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న తాటాకు ఇళ్లు



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

నిరాశ్రయులైన మూడు కుటుంబాలు

అల్లవరం: మండలం గూడాలలో శనివారం అర్ధ రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకు ఇళ్లు దగ్ధంతో పాటు ఒక భవనం పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదవంలో మూడు కుటుంబాలు పూర్తిగా నిరాశ్రయమయ్యాయి. ఇంటిలో ఉన్న వారు గాఢ నిద్రలో ఉండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పదిమంది ప్రాణాపాయం నుండి త్రుటిలో బయటపడ్డారు. ఇంటి పైకప్పు నుంచి మంటలు గమనించిన ఎనిమిదో తరగతి చదువుతున్న దొడ్డా రేవతి అందరినీ నిద్ర లేపి ప్రాణాలు కాపాడింది. మొదట ఆకుల మంగతాయారు (దివ్యాంగురాలు)కు చెందిన ఇంటి పైకప్పు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కింట్లో నిద్రిస్తున్న దొడ్డా వెంకటేశ్వరరావు కుమార్తె రేవతి ఆ మంటలు గమనించి కేకలు వేసి అందరినీ లేపడంతో వారంతా బయటకు పరుగులు పెట్టారు. ఆకుల మంగతాయారు, ఆకుల వెంకటేశ్వరరావు, ఆకుల సత్యనారాయణల ఇళ్లు దగ్ధం కాగా, పక్కనే ఉన్న ఆకుల సత్తిబాబు డాబా ఇల్లు మంటల తీవ్రతకు పాక్షికంగా దెబ్బతింది. ఈ సమాచారం అందుకున్న అమలాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించడంతో ఇళ్లల్లో ఉన్న ఐదు గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఒక సిలిండర్‌ను బయటకు లాగగలిగారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో బాధిత కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. సీఐ పి.వీరబాబు ఎస్‌ఐ హరీష్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అందరిని నిద్రలేపి ప్రమాదం నుంచి తప్పించిన చిన్నారి రేవతిని అందరూ అభినందించారు. ఘటన స్థలాన్ని మంత్రి విశ్వరూప్ పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రమాద బాధితులకు అమలాపురం మునిసిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు నిత్యావసరాలు అందించారు. ఎంపీపీ శేషగిరిరావు, సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గౌతమి, మండల అధ్యక్షుడు కె.బాబూజీ, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమెల్లి బోసు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాతి శ్రీను, ఉప సర్పంచ్ ముత్తాబత్తుల సంతోష్ బాధితులకు రైస్ ప్యాకెట్లు, కాయగూరలు బట్టలు, కొంత నగదు అందించారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి

- ఎస్ఈబీ అధికారులకు జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి ఆదేశం



ఐ.పోలవరం మండలం ఎదుర్లంక చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎస్ఈబీ నిరంతర నిఘాతో అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆ శాఖ విజయవాడ జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఎస్ఈబీ ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో ఎన్నికలయ్యే వరకూ నిత్యం నిరంతర నిఘాతో వాహనాలు తనిఖీలు చేయాలని ఆదేశించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారులతో ఆదివారం సాయంత్రం ఆమె సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ నిఘా, వాహనాల తనిఖీల ద్వారా సీజ్ చేసిన మద్యం, నగదు వివరాలు, నమోదైన కేసులను పరిశీలించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. నగదు, మద్యం, సారా, ఎన్నికల్లో పార్టీలు తాయిలాలుగా పంచే వస్తువుల స్వాధీన సమయంలో ఎన్నికల నిబంధనలను విధిగా అనుసరించాలని సూచించారు. జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఎస్ఈబీ డీఎస్ఈవో కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తనిఖీలు పారదర్శకంగా చేస్తున్నట్టు వివరించారు. ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమరబాబు, సత్యనారాయణ, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరు, రామచంద్రపురం ఎస్ఈబీ సీఐలు, జిల్లా టాస్క్‌ఫోర్స్, ఇంటిలిజన్స్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పలు చెక్‌పోస్టుల పనితీరును తనిఖీ చేశారు.

ప్రజాభ్యుదయమే అరసం లక్ష్యం

- ఉద్ఘాటించిన సంఘం నాయకులు
- బండారులంకలో తొలి జిల్లా మహాసభ
- జిల్లా అధ్యక్షునిగా స్వామి ప్రసాద్ ఏకగ్రీవం



అధ్యక్షుడు స్వామి ప్రసాద్



ప్రధాన కార్యదర్శిగా నరసింహారావు



జిల్లా మహాసభలో సంఘీభావం తెలుపుతున్న కవులు, రచయితలు, సాహితీవేత్తలు తదితరులు

అమలాపురం రూరల్: సంఘ సంక్షేమమే సాహిత్య లక్ష్యం అయి ఉండాలని విశ్వ శ్రేయస్సుకు సాహిత్యం అంకితం కావాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. రూరల్ మండలం బండారులంక వీఎస్ఎం షాపింగ్ మాల్ వద్ద ఆదివారం సంఘం జిల్లా తొలి మహాసభ నిర్వహించారు. అరసం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో కోనసీమ జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. సంఘం కన్వీనర్ గండి స్వామి ప్రసాద్ అతిథులకు స్వాగతం పలికారు. అరసం రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంఘం సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ మాట్లాడుతూ సాహిత్యం ప్రాధాన్యాన్ని వివరించారు. నేటి సామాజిక అంశాలపై కవితలు వినిపించిన జిల్లా కవులను నిర్వాహకులు సత్కరించారు. ఉమ్మడి జిల్లాలోని సాహిత్య చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. తొలుత మహనీయులు అంబేడ్కర్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. ప్రజలను మేల్కొలిపేందుకు సాహితీవేత్తలంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. సాంస్కృతిక పునరుజ్జీవనమే లక్ష్యంగా అరసం నూతన కమిటీ సభ్యులు ముందుకు సాగాలని కాంక్షించారు. సాహితీ సంఘాలు ఎన్ని ఉన్నా ప్రజాభ్యుదయ అంశాలతో పుస్తకాలను ప్రచురిస్తూ సభలు, సమావేశాలను నిర్వహించడంలో అరసం ముందున్నదన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండి స్వామిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జేవీఎల్ నరసింహారావు, గౌరవ అధ్యక్షులుగా ఊటకూరు సుబ్రమణ్య స్వామి, దాట్ల దేవదానం రాజు, చల్లా రవికుమార్, ఉపాధ్యక్షులుగా మాడా రాము, నేరేడుమిల్లి అబ్బులు, కార్యవర్గ సభ్యులుగా రాయుడు త్రినాథరావు, నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, పినిపే సత్యనారాయణ, గొర్రెలరాము, కవి శ్రీ నాగేంద్ర స్వామి, కాజా మొహిద్దీన్ కొండేపూడి వినయ్ కుమార్, బి.సాంబమూర్తి, గిడ్డి ప్రకాశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరప: పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఒక జట్టుకూలీని లారీ ఢీకొట్టగా మరణించిన ఘటన కరప మండలం కరప, వలసపాకల గ్రామాల మధ్య చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు మండలం వలసపాకల గ్రామానికి చెందిన వాసంశెట్టి లోవరాజు (35) కాకినాడ పోర్టులో మూటల పనిచేస్తుంటాడు. ఆదివారం పోర్టులో డ్యూటీ ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా కరప శ్మశానవాటిక సమీపంలోకి వచ్చేసరికి రామచంద్రపురం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లోవరాజుకు నుదుటిపైన, కుడికాలుపైన తీవ్రంగా రక్తపు గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లోవరాజు అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కరప ఎస్ఐ టి.రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న లోవరాజు

డివైడర్‌ను ఢీకొని మరొకరు..



మృతుడు దున్నా రవీంద్ర(24)

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం శివారులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం దున్నా రవీంద్ర (24) ఆదివారం స్నేహితులతో కలసి పొలం వెళ్లాడు. తల్లి ఫోన్ చేసి ఇంటికి రమ్మనడంతో బైపాస్‌పై బైక్‌పై వస్తున్న రవీంద్ర అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రవీంద్రకు తీవ్ర గాయాలు కాగ అంబులెన్స్‌లో నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.